వ్యవసాయ శాస్త్రవేత్తకు సన్మానం

డాక్టర్ శ్రీశైలంకు మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం, ఏప్రిల్ 28: ఝరాసంగం మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీశైలం(27) ఇటీవల విడుదలైన ఏఎస్ఆర్‌బీ జాతీయ స్థాయి వ్యవసాయ శాస్త్రవేత్త నియామక పరీక్షల ఫలితాల్లో విజయం సాధించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఫార్టిలైజర్ షాపులో అతడిని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పూలమాల, శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి ముగ్గురు వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎన్నికకాగా అందులో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి డాక్టర్ శ్రీశైలం ఎన్నిక కావడం సంతోషంగా ఉన్నదన్నారు. నేటి యువత డాక్టర్ శ్రీశైలంను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశం, మండల మాజీ అధ్యక్షుడు బొగ్గుల సంగమేశ్వర్, మాజీ ఆలయ చైర్మన్ నరసింహా గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్, నాయకులు కిషన్, విజయ్ పటేల్, మాణిక్ యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కోహీర్ పట్టణ అధ్యక్షుడిగా ఇష్తికార్

కోహీర్, ఏప్రిల్ 28: భారత రాష్ట్ర సమితి కోహీర్ పట్టణ అధ్యక్షుడిగా ఇష్తికార్ అలీని నియమించారు. శనివారం రాత్రి కోహీర్ పట్టణంలో పార్టీ పటిష్టానికి తీసుకోవాల్సిన అంశాలపై బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయనను పట్టణ అధ్యక్షుడిగా నియమించారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ అధ్యక్షుడు నర్సింహులు కోరారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కలీం పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

హారతి ఇస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నిజాంపేట్, ఏప్రిల్ 28: మండల పరిధిలోని మునిగెపల్లిలో ఆంజనేయ స్వామి నూతన ఆలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే పట్లోల్ల డాక్టర్ సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి హారతి ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోహీర్, ఏప్రిల్ 28: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృత్యువాత పడిన ఘటన మండలంలోని దిగ్వాల్ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. కోహీర్ ఎస్సై కృష్ణయ్య కథనం ప్రకారం.. దిగ్వాల్ గ్రామానికి చెందిన రమేశ్(40) పిరమల్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటికి చేరుకునేందుకు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో 65వ జాతీయ రహదారి దాటుతుండగా జహీరాబాద్ వెళ్లే వాహనం అతడిని ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయాలై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. రమేశ్ భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మే 2లోగా ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

న్యాల్‌కల్, ఏప్రిల్ 28: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు మే 2వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని న్యాల్‌కల్, హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్, అశోక్ తెలిపారు. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులతో పాటు ఇంప్రూవ్‌మెంట్ రాసేవారు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా గడువులోగా ఫీజు చెల్లించాలని సూచించారు.

ఘనంగా బీరప్ప జాతర

కోహీర్, ఏప్రిల్ 28: మండలంలోని గొటిగార్‌పల్లిలో ఆదివారం బీరప్ప జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

పటాన్‌చెరు బీఆర్ఎస్‌కు కంచుకోట

- వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

తెల్లాపూర్‌లో ముఖ్యకార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 28: పటాన్‌చెరు నియోజకవర్గం బీఆర్ఎస్‌కు కంచుకోట అని, తెల్లాపూర్ మున్సిపాలిటీ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ తీసుకురావాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సూచించారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీలో ముఖ్యకార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ నెల 30వ తేదీన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించనున్న సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ రావడం ఖాయమని తెలిపారు.బీఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, నాయకులు లచ్చిరాం, రమేశ్, నర్సింలు, యాదయ్య, కొమురయ్య, ఇంద్రారెడ్డి, బాబ్జీ, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

బొల్లారం, ఏప్రిల్ 28: ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో పూరి జగన్నాథ్ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారుల ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ... పూరి జగన్నాథ్ ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్లు వేణుపాల్ రెడ్డి, సాయికిరణ్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, బీరప్ప యాదవ్, నాయకులు యాదిరెడ్డి, జైపాల్ రెడ్డి, రత్నం, విట్టల్ చారి, నబీ, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో మానసిక ప్రశాంతత

జిన్నారం, ఏప్రిల్ 28: ఆలయాల్లో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాదారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం నిర్వహించిన రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అందరికీ మానసిక ప్రశాంతత అవసరం అన్నారు. తమ దైనందిత జీవితంలో ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆధ్యాత్మికతను పెంచేందుకు నూతన ఆలయాలు, మసీదులు, చర్చిలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు వెంకటేశంగౌడ్, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్, రాంచందర్‌గౌడ్, గణేశ్, సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం: బీఆర్ఎస్ నాయకులు, మహిళలతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

వీరభద్రేశ్వరాలయంలో మంత్రి పూజలు

పూజలు చేస్తున్న మంత్రి దామోదర

రాయికోడ్, ఏప్రిల్ 28: మండల కేంద్రమైన రాయికోడ్ వీరభద్రేశ్వర స్వామి జాతరలో భాగంగా ఆదివారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీరభద్రేశ్వరస్వామి ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలు అందరిలో భక్తిభావం నింపుతాయన్నారు. ఆయనవెంట కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్, బిచుకుంద పీఠాధిపతి సోమయప్ప మహారాజ్, జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు అంజయ్య, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్నపాటిల్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు, మాజీ సర్పంచ్ కేదారినాథ్‌పాటిల్, యూత్ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, మండల నాయకులు బస్వరాజుపాటిల్, సతీష్‌పంతులు, రాజాగౌడ్, సునీల్, రాచయ్య స్వామి ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే సునీతారెడ్డి

విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, ఏప్రిల్ 28: హత్నూర మండలం కాసాల 12వ వార్డులో నూతనంగా నిర్మించిన పోచమ్మతల్లి ఆలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, అంబటి అర్జున్, శేఖర్‌గౌడ్, కిశోర్, వెంకట్‌గౌడ్, బక్కరవి, శ్రీనివాస్‌రెడ్డి, కిష్టారెడ్డి, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

- బీఆర్ఎస్ పుల్కల్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్

పుల్కల్, ఏప్రిల్ 28: నాయకులు, కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని అండగా ఉంటామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పుల్కల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆరు గ్యారెంటీలను అమలు చేయడం చేతకాక బీఆర్ఎస్‌పై తప్పుడుప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల లబ్ధిపై ఇంటింటికీ ప్రచారానికి వెళ్లినప్పుడు ప్రజలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈ నెల 30న బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీలో ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ యాదగిరిరెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ వైర్మన్ పల్లె సంజీవయ్య, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పడమటి రమేశ్, ఉపాధ్యక్షుడు కలాలి కిషన్‌గౌడ్, విష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల పోచయ్య, కనకారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి..

ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్

కోహీర్, ఏప్రిల్ 28: బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నుంచి తిరిగి సొంతగూటికి చేరారు. ఆదివారం గౌసాబాద్ తండాకు చెందిన మాజీ సర్పంచ్ సంజీవ్ రాథోడ్, మాజీ ఉప సర్పంచ్ జానూ రాథోడ్‌తోపాటు వారి అనుచరులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఎన్నికల సమన్వయ కర్త దేవీప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ వారికి గులాబీ కండువా వేసి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. బీజేపీ నేతలు చేస్తున్న మోసపూరిత మాటలు తమకు అవమానకరంగా ఉన్నాయని, అందుకే తాము ఆ పార్టీని వీడినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, గోపాల్ బానోత్, సంజీవ్‌పవార్, తిమోతి, హీరు రాథోడ్, కిషన్ బానోత్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్, ఏప్రిల్ 28: లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి అమీన్‌పూర్ మున్సిపల్, మండలం నుంచి భారీ మెజార్టీ అందించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం అమీన్‌పూర్ బాలాజీ కన్వెన్షన్ హాలులో అమీన్‌పూర్ మున్సిపల్, మండల పరిధిలోని బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మధ్యతేడా ప్రజలకు పూర్తిగా అర్థమయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారని, మళ్లీ బీఆర్ఎస్ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నారు. మే 13న జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేయించేందుకు మనమంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నర్సింహాగౌడ్, ఎంపీపీ దేవానంద్, జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, కవితాశ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు యూనుస్, రాములు, నాయకులు జగదీశ్, గోపాల్ దాస్‌యాదవ్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు నాయకులు

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ఎన్నికల అధికారులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి, పాల్గొన్న ఎన్నికల నిర్వహణ అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 28: ఈవీఎంల పనితీరుపై ఏఆర్వోలు, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులకు, మాస్టర్ ట్రైనర్లకు కనీస అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఆదివారం పోతిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల ఏఆర్వోలు, తహసీల్దార్లు, నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లకు ఈవీఎంల కమిషనింగ్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ పొందిన పరిజ్ఞానాన్ని ఎన్నికల సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇవ్వాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇవ్వాలన్నారు. మే 1, 2, 7, 8 తేదీల్లో రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ యంత్రాంగం ఈవీఎం, వీవీ ప్యాట్‌ల సమస్యలు పరిష్కరించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అధికారులకు ఈవీఎంల పని తీరుపై తరచూ వచ్చే సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఏసీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, ఆర్డీవోలు రాజు, పాండు, వసంతకుమారి, అశోక చక్రవర్తి, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలోని 10 మంది ఏఆర్వోలు, ట్రైనింగ్ నోడల్ అధికారులు, తహసీల్దార్లు, 205 మంది సెక్టోరియల్ అధికారులు, 55 మంది మాస్టర్ ట్రైనర్లు, ఏఎల్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.



పొమ్యానాయక్ తండాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసపోతాం

- అబద్ధాలతో అధికారంలోకి వచ్చింది
- తండాలను జీపీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే..
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఏప్రిల్ 28: మాయమాటలు, అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, దానికి ఓటేస్తే మోసపోతామని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఖానాపూర్ కే, జమ్లానాయక్ తండా, పొమ్యానాయక్ తండాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలను జీపీగా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ఘనతేనన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు అని చెప్పిన కాంగ్రెస్ హామీలను విస్మరించిందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటర్లు తగిన బుద్ధి చెబుతారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. కరువు వచ్చిందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు అంజయ్యసాగర్, సంగప్ప, గోపాల్‌రెడ్డి, మాణిక్‌ప్రభు, జైరాం, గంగారెడ్డి, మోహన్‌సాగర్, సాయిలు, లక్ష్మణ్, హన్మంత్‌రెడ్డి, ప్రశాంత్‌సాగర్, వెంకటేశం, బీరప్ప, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

నారాయణఖేడ్, ఏప్రిల్ 28: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ శెట్కార్ సోదరుడి సొంత గ్రామమైన చాప్టా(కె)ను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చాప్టా(కె) అక్షయి తండాల్లో పర్యటించి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురేశ్ శెట్కార్ గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా ఉన్నప్పటికీ తన సోదరుడి గ్రామానికే ఏమి చేయలేదని, ఇక నియోజకవర్గ అభివృద్ధి గురించి ఏం పట్టించుకుంటాడని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధికారం చేపట్టి తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాతనే చాప్టా(కె) గ్రామానికి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడంతో పాటు లింగాయత్ భవన్ నిర్మాణం, ఇంటింటికీ నల్లా ద్వారా నీరందించినట్లు తెలిపారు. గ్రామంలో నీటి సరఫరా సరిగా లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథతో నీటి కోసం మహిళల ఇబ్బందులు దూరం అయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, నాయకులు రవీందర్‌నాయక్, సత్యపాల్‌రెడ్డి, పార్శెట్టి సంగప్ప, రాజు, రవికుమార్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే

నిజాంపేట్, ఏప్రిల్ 28: నిజాంపేట్ మండల పరిధిలోని మునిగెపల్లి గ్రామంలో ఆదివారం అభయాంజనేయ స్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులతో కలసి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజ చేస్తున్న అల్లీనగర్ గ్రామస్తులు

జిన్నారం, ఏప్రిల్ 28: గడ్డపోతారం పంచాయతీ అల్లీనగర్‌లో గాలిపోచమ్మ, ఎల్లమ్మ తల్లి, కట్ట మైసమ్మ ఆలయాల నిర్మాణానికి ఆదివారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. ఒకే రోజు మూడు ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేయడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. గ్రామస్తులతో పాటు గడ్డపోతారం, చెట్లపోతారం, కిష్టయ్యపల్లి గ్రామస్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఆలయాల నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలని అల్లీనగర్ గ్రామ ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఆలయ నిర్మాణాలకు తమవంతు సహకారం అందిస్తామని ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జనాబాయి, మాజీ సర్పంచ్‌లు ప్రకాశ్‌చారి, నీరుడి శ్రీనివాస్, అశోక్, మాజీ ఎంపీటీసీ బాశెట్టిరాజు, మద్దూరి పెంటేశ్, లక్ష్మణ్‌రావు, కుమార్, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ

రాయికోడ్, ఏప్రిల్ 28: మండల కేంద్రమైన రాయికోడ్‌లో శ్రీవీరభద్రేశ్వరస్వామి జాతరలో భాగంగా భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ, అగ్నిగుండం కార్యక్రమాలు లాడ్‌గేరి మహారాజ్ ఆధ్వర్యంలో కొనసాగాయి. ఆదివారం ఉదయం నుంచి శ్రీవీరభద్రేశ్వరస్వామి ఆలయం మీదుగా పల్లకీసేవ జరిగింది. అనంతరం బసవేశ్వరస్వామి ఆలయం వద్ద అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో మోహన్‌రెడ్డి, ఎస్ఐ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పి.కేదారినాథ్‌పాటిల్, వరం వైస్ చైర్మన్ తుకారం ఉన్నారు.

ఆస్తిపన్నుపై రాయితీ

- ముందస్తుగా చెల్లిస్తే ఐదు శాతం డిస్కౌంట్
- మున్సిపాలిటీలో నివాసాలు, వాణిజ్య సముదాయాలకు వర్తింపు
- రేపటితో ముగియనున్న గడువు



సదాశివపేట, ఏప్రిల్ 28: మున్సిపాలిటీలో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5శాతం రాయితీ కల్పిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను మొత్తం ఒకేసారి చెల్లించిన వారికి పన్నులో ఐదుశాతం మినహాయింపు ఇవ్వనున్నారు. మున్సిపాలిటీలోని నివాసాలతో పాటు వాణిజ్య సముదాయాలకు ఈ ఐదు రాయితీ వర్తించనున్నది. ఈ విషయంపై విస్తృతంగా ప్రచారం చేసి తద్వారా ఏప్రిల్ నెలలోనే ఎక్కువ శాతం ఆస్తిపన్ను వసూలు చేసుకోవాలని మున్సిపల్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

బకాయిలులేని వారికి మాత్రమే వర్తింపు

మున్సిపాలిటీలో భవనాలు, బహుళ వాణిజ్య భవనాలకు గతంలో ఎలాంటి ఆస్తి పన్ను బకాయిలు లేని వారు మాత్రమే ఐదు శాతం రాయితీకి అర్హులవుతారు. 2024 మార్చి 31లోపు కూడా ఆస